సాక్షి
సంగారెడ్డి

ఆదివారం । 19 । నవంబర్ । 2023



హాజరైన ప్రజలు, కార్యకర్తలు

రాజేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే నెల రోజుల్లో చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తా. చేర్యాలతో నాకు ప్రత్యేకమైన అనుబంధముంది. పల్లాను గెలిపిస్తే తాను అడిగిన హామీలన్నీ నెరవేరుస్తా అని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర సాధన, హక్కుల కోసం పుట్టిందన్నారు. తొలి, మలి దశ ఉద్యమాల్లో మోసం చేసింది కాంగ్రెస్సేనని విమర్శించారు.

నెల రోజుల్లో చేర్యాల డివిజన్

హామీలన్నీ నెరవేర్చే బాధ్యత నాది

- ఈ ప్రాంతంతో నాకు ప్రత్యేక అనుబంధం
- పట్టణ కేంద్రంలో హిందీ విశారద చదివాను
- పల్లాను భారీ మెజార్టీతో గెలిపించాలి
- ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

చేర్యాల(సిద్దిపేట): తాను హిందీ విశారద పట్టణ కేంద్రంలోని ఓ మాస్టారు వద్ద చదివానని సీఎం కేసీఆర్ తెలిపారు. తనకు ఇక్కడ చాలా మంది రారా పోరా అని పిలిచే చిన్ననాటి స్నేహితులు ఉన్నారని పాత జ్ఞాపకాలను గుర్తు చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల గుణగణాలు, తన చరిత్ర, పార్టీ చరిత్రను చూసి వజ్రాయుధం లాంటి ఓటును సొంత విచక్షణతో వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చేర్యాల పట్టణ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వెనుక గ్రౌండ్‌లో శనివారం జనగామ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరై ప్రజలనుద్దేశించి మాట్లాడారు.

తెలంగాణ రాకుండా కుట్రలు

తెలంగాణ రాకుండా చాలా కుట్రలు చేశారని, కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ శవయాత్రనా.. తెలంగాణ జైత్ర యాత్రనా.. అని చావు నోట్లో తలపెట్టి రాష్ట్రం సాధించుకున్నామన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం కరెంటు, నీళ్లు తెచ్చింది ఎవరో.. మాయ మాటలు చెప్పేది ఎవరో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్ర సంపద పెరిగింది కాబట్టే రూ.2 వేల పెన్షన్ అందిస్తున్నామని, మళ్లీ గెలిచాక రూ.5 వేలకు పెంచుతామని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్ వంటి ఎన్నో సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు.

స్థానికంగా పరిశ్రమల ఏర్పాటు

ఎన్నికల పర్యటనలో భాగంగా హెలికాప్టర్‌లో పర్యటిస్తుంటే రాష్ట్రమంతటా ధాన్యం కుప్పలు కనిపిస్తున్నాయన్నారు. ఎన్నికల్లో గెలుపొందాక రైతుబంధు ఎకరాకు రూ.16 వేలు అవుతుందన్నారు. కాంగ్రెస్ గెలిస్తే ఉన్నది పోతుందని, ధరణి తీసేస్తానంటున్నారని విమర్శించారు. సిద్దిపేట, జనగామతో పాటు జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఏడాదికి 10 వేల మంది వైద్యులను తయారు చేసే స్థాయికి రాష్ట్రం ఎదిగిందన్నారు. పల్లాను గెలిపిస్తే ఇంతకు రెట్టింపు అభివృద్ధి చేయడంతో పాటు స్థానికంగా పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

సీఎం చలోక్తులు

సభా వేదికపైకి కేసీఆర్ అడుగుపెట్టగానే పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున జై తెలంగాణ, జై కేసీఆర్ అని నినాదాలు చేశారు. సభలో భాగంగా సీఎం తనదైన శైలిలో మాటల తూటాలు వదిలారు. చేర్యాలలో సభ పెడితే చాలన్నడు ఇప్పుడు ఇవన్నీ అడుగుతుండని చెబుతూ ..దొడ్లకు వచ్చిన గేదె పెండ పెట్టకుండా పోతుందా ? అంటూ నేను వచ్చాను కదా ఇక అడిగినవన్నీ కచ్చితంగా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. సాయి సంసారి లచ్చి దొంగ, కాకరకాయ తోక మాటలు చాలా మాట్లాడుతుంటారని ప్రతిపక్షాలను ఉద్దేశించి తనదైన శైలిలో విమర్శించారు. తీర్థం పోదాం తిమ్మక్క అంటే వాడు గుళ్లె నీవు సల్లె అని ప్రతిపక్షాల తీరును ఎండగట్టారు. ఇంటి సూరుని సగబెట్టడు వాడు సూరునీళ్లు పట్టు కొస్తాడట. పాలిచ్చే బర్రె అమ్ముకొని దున్నపోతు కొనుక్కొచ్చు కుంటారా ప్రజలు దయచేసి ఆలోచించి ఓటు వేయాలన్నారు.



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

కేసీఆర్ వెంటే చేర్యాల, జనగామ

పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఉవ్వెత్తున ఎగిసిపడ్డ తెలంగాణ ఉద్యమంలో చేర్యాల, జనగామ ప్రాంతమంతా కేసీఆర్ వెంట నడిచిందని జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాల ప్రాంతంలో కేసీఆర్‌కు చాలా మంది చిన్ననాటి మిత్రులున్నారని, ఈ ఎన్నికల్లో ఆయన్ని మూడోసారి సీఎం చేసేందుకు అంకిత భావంతో ఉన్నారన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్, ఫైర్ స్టేషన్, మినీస్టేడియం, కొముదవెల్లి, మద్దూరు, దూళ్మిట్ట మండల కేంద్రాల్లో ప్రభుత్వ శాఖల కోసం ఇంటిగ్రేటెడ్ భవనాల నిర్మాణం చేపట్టాల్సి ఉందని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఈ పనులన్నీ పట్టాలెక్కుతాయన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీళ్ల తెచ్చాం, మల్లన్నసాగర్ రిజర్వాయర్ల పరిధిలో మిగిలిన డిస్ట్రిబ్యూషన్ కాల్వల నిర్మాణ పనులు పూర్తి చేసి, ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. చేర్యాల పట్టణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉంది, దీనికి తోడుగా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని సీఎంను కోరామని తెలిపారు.

అధికారులే కీలకం



- ఓటరు జాబితా నుంచి ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు..
- జిల్లా ఎన్నికల అధికారి నుంచి బీఎల్‌ఓ వరకు బాధ్యతలు

జోగిపేట (అందోల్) : ఎన్నికల నిర్వహణలో బీఎల్‌ఓ నుంచి జిల్లా ఎన్నికల అధికారి వరకు అంతా కీలకం. ఓటరు జాబితా మొదలుకొని ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు వారి పాత్రే ఉంటుంది. బరిలో ఉన్న అభ్యర్థులు నామినేషన్ పత్రాల దాఖలు నుంచి ఎన్నికల నియమావళి అమలు, పోలింగ్ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడించే వరకు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. తెలంగాణ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా స్థాయి అధికారులు వారి ఉన్నతాధికారులు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా వారి విధులపై కథనం.

జిల్లా ఎన్నికల అధికారి

కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. ఎన్నికల్లో విధులు నిర్వర్తించే అధికారులకు విధుల కేటాయింపు మొదలుకుని సిబ్బందికి శిక్షణ, ఎన్నికల కార్యక్రమాల పూర్తిస్థాయి పర్యవేక్షణ, నిత్యం సమీక్షలు జరుపుతూ మార్గదర్శకం చేస్తారు. అంతేగాక ఎన్నికల విధులు బాధ్యతాయుతంగా, ప్రశాంత వాతావరణంలో సాగేలా పర్యవేక్షిస్తారు. మొత్తంగా ఓటరు జాబితా తయారీ నుంచి ఓట్ల లెక్కింపు వరకు ఆయనదే పూర్తి బాధ్యత.

రిటర్నింగ్ అధికారి

నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి ఉంటారు. ఆయా నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల కమిషన్ నియమిస్తుంది. తమ పరిధిలోని ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, అభ్యర్థుల తుదిజాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది నియామకం, శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి, వసతుల కల్పన, తదితర అంశాలు వారి పరిధిలో ఉంటాయి.

ప్రిసైడింగ్ అధికారి

ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఆ కేంద్రం పరిధిలో జరిగే అన్ని విషయాలకు సంపూర్ణ బాధ్యత ఆయనదే. ఓటింగ్‌కు అవసరమైన ఈవీఎంలు, వీవీప్యాట్లు, ఇతర సామగ్రి సమకూరుస్తారు. పోలింగ్ అనంతరం ఎన్నికల సామగ్రిని తిరిగి నియోజకవర్గస్థాయి స్ట్రాంగ్ రూమ్‌కు చేరుస్తారు. వీరికి సహాయకంగా అదనపు ప్రొసీడింగ్ అధికారి ఉంటారు.

పోలింగ్ కేంద్రాల్లో జరిగే కార్యకలాపాలన్నీ వారి పర్యవేక్షణలోనే ఉంటాయి. ఎన్నికల నియమావళికి అనుగుణంగా పనిచేస్తారు. వీరితోపాటు మరో ఇద్దరు పోలింగ్ అధికారులు పనిచేస్తారు. పోలింగ్ బూత్‌లలోని ఈవీఎంల పనితీరు, ఇతర కార్యకలాపాలకు బాధ్యత వీరిదే.

సెక్టోరియల్ అధికారి

సెక్టోరియల్ అధికారులు సైతం ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తారు. ముఖ్యంగా పోలింగ్ బూత్‌ల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఒక్కొక్కరి పరిధిలో 6 నుంచి 9 పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. ఇందులో తాగునీటి వసతి, ఫర్నిచర్, విద్యుత్, లైట్లు, ర్యాంప్‌ల ఏర్పాటు, ఫ్యాన్లు, వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణ జరిగేలా చూస్తారు. తమ పరిధిలో జరిగే అంశాలకు వీరే బాధ్యత వహిస్తారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మహిపాల్‌రెడ్డి

ఆశీర్వాద సభా ఏర్పాట్ల పరిశీలన

- 23న సీఎం రాక

పటాన్‌చెరు: ఈనెల 23న సీఎం ప్రజాఆశీర్వాద సభా ఏర్పాట్లను బీఆర్‌ఎస్ పటాన్‌చెరు అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. శనివారం పటాన్‌చెరు ఎల్లెంకి కళాశాల సమీపంలో 15 ఎకరాల సువిశాల ప్రాంగణంలో పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాల నుంచి లక్ష మంది కార్యకర్తలతో సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలి

సంగారెడ్డి టౌన్ : మాస్టర్ ట్రైనర్లు నియోజకవర్గ స్థాయి పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని డీఆర్‌ఓ నగేశ్ అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శనివారం కలెక్టరేట్‌లో పునశ్చరణ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21, 22, 23వ తేదీల్లో ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రిసైడింగ్ అధికారులు, సహాయక ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వడానికి పూర్తి స్థాయిలో సిద్ధం కావాలన్నారు. సిబ్బందికి అన్ని అంశాలపై పూర్తి పట్టు సాధించేలా శిక్షణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మహిపాల్ రెడ్డి, ఏఓ పరమేశ్వర్, మాస్టర్ ట్రైనర్ కృష్ణకుమార్, నియోజకవర్గస్థాయి మాస్టర్ ట్రైనర్లు, ఎన్నికల విభాగపు అధికారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌ఓ నగేశ్



మాట్లాడుతున్న అధికారులు

విధుల్లో అప్రమత్తత తప్పనిసరి

అధికారులకు స్పెషల్ ఎలక్షన్ అబ్జర్వర్ సూచన

సంగారెడ్డి టౌన్ : జిల్లాలో శాసనసభ ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని విధాలా అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల జనరల్ స్పెషల్ ఎలక్షన్ అబ్జర్వర్ అజయ్ వి.నాయక్, పోలీస్ స్పెషల్ ఎలక్షన్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా అధికారులకు సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నడుచుకోవాలని తెలిపారు. శనివారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు, వ్యయపరిశీలకులు, పోలీస్ అబ్జర్వర్, కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ, నోడల్ అధికారులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్నికలు పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. విధి నిర్వహణలో పాటించాల్సిన పలు విషయాలపై సూచనలు, సలహాలిచ్చారు. పూర్తి బందోబస్తు కట్టుదిట్టమైన ఏర్పాట్లతో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. అంతకు ముందు కలెక్టర్ శరత్ ఎన్నికల నిర్వహణ సంసిద్ధత ఏర్పాట్లపై పీపీటీ ద్వారా అబ్జర్వర్లకు వివరించారు. జిల్లాలో ఓటర్ల సంఖ్య, స్వీప్ కార్యక్రమాలు, ఇప్పటివరకు సీజ్ చేసిన మద్యం, నగదు తదితరాలను వివరాలు వెల్లడించారు. పోలింగ్, కౌంటింగ్‌కు అన్నివిధాలా సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఎస్పీ రూపేశ్ శాంతి భద్రతలకు చెందిన ఏర్పాట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు పవన్ కుమార్, దీపక్ సింగ్లా, ఎన్నికల వ్యయ పరిశీలకులు నజీమ్ జైఖాన్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, అదనపు ఎస్పీ అశోక్, డీఆర్‌ఓ నగేశ్, ఆయా నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీ ఇస్తే చెరకును తరలిస్తాం

- రైతుల స్పష్టీకరణ
- సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద వాహనాలు నిలిపేసిన అధికారులు
- రైతుసంఘం నేతల నిరసన
- అసిస్టెంట్ కేన్ కమిషనర్‌తో భేటీ

జహీరాబాద్: ప్రభుత్వం రవాణా సబ్సిడీ, కూలీలు, వాహనాల సదుపాయం కల్పిస్తే ఇక్కడ కర్మాగారాలకు తరలిస్తామని రైతులు, రైతు సంఘం నేతలు తెలిపారు. ఈ విషయంలో అధికారులు, ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం చెరకు లోడు తీసుకెళ్తున్న వాహనాలను రాష్ట్ర సరిహద్దులోని మాడ్గి చెక్‌పోస్టు వద్ద అధికారులు నిలిపేశారు. విషయం తెలుసుకున్న చెరకు రైతు సంఘం నాయకులు ఢిల్లీ వసంత్, కొండల్‌రెడ్డి, పి.నర్సింహారెడ్డి, పలువురు రైతులు అక్కడికి చేరుకొని ఆందోళనకు దిగారు. వాహనాలను అడ్డుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దీంతో అధికారులు తాత్కాలికంగా వాహనాలను విడిచిపెట్టారు. అనంతరం సీడీసీ కార్యాలయానికి చేరుకుని అసిస్టెంట్ కేన్ కమిషనర్ రాజశేఖర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జోన్ పరిధిలోని చెరకును పక్క రాష్ట్రాలకు కాకుండా మన రాష్ట్రంలోని ఇతర కర్మాగారాలకు మాత్రమే తరలించుకోవాలని కమిషనర్ భద్రు మలోతు అధికారిక ఉత్తర్వులు ఇవ్వడాన్ని తప్పుపట్టారు. కర్ణాటక, మహారాష్ట్రకు తరలిస్తే రైతులకు అధిక ధర వస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని ఇతర కర్మాగారాలకు తరలిస్తే టన్నుకు రూ.400వరకు నష్టం వస్తుందని పేర్కొన్నారు. జహీరాబాద్‌లోని ట్రైడెంట్ కర్మాగారం సవ్యంగా నడపక పోవడం వల్లే దగ్గరలో ఉన్న కర్ణాటకకు రైతులు తరలిస్తున్నారన్నారు. మహబూబ్‌నగర్‌లోని కొత్తకోట, సంగారెడ్డిలోని గణపతి, మాగిలోని గాయత్రి కర్మాగారాలకు తరలిస్తే రవాణా భారం పడుతోందన్నారు. అదే కర్ణాటకకు తరలిస్తే లేబర్, వాహనాల సౌకర్యాన్ని అక్కడి యాజమాన్యాలు కల్పిస్తున్నాయని చెప్పారు. అయితే కేన్ కమిషనర్, ప్రభుత్వం తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు జ్యోతి పండాల్, విశ్వనాథ్‌యాదవ్ పాల్గొన్నారు.



చెక్‌పోస్టు వద్ద నిలిపివేసిన వాహనాలు

తరలింపును అడ్డుకోవద్దు : డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

చెరకు రైతులు వారి ఇష్టం ఉన్న చోటుకు ఉత్పత్తులను తరలించుకుని విక్రయించుకునే వెసులుబాటు కల్పించాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్ అసిస్టెంట్ కేన్ కమిషనర్ రాజశేఖర్‌ను కోరారు. శనివారం పట్టణంలోని అసిస్టెంట్ కేన్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కమిషనర్ భద్రు మాలోతును ఫోన్‌లో సంప్రదించినట్లు వివరించారు. నాన్ జోన్‌కు చెరకును తరలించుకోరాదని జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వ పరంగా సూచించినట్లు తెలిపారు. గతేడాదికి సంబంధించిన బకాయిలు ట్రైడెంట్ పరిశ్రమ నుంచి ఇంకా రైతులకు రావాల్సి ఉందన్నారు. ఇప్పటికీ అందులో క్రషింగ్‌ను చేపట్టలేదని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆపవద్దని కోరిగా సమ్మతించారన్నారు.

న్యూస్‌రీల్

అక్రమ నిర్మాణాల కూల్చివేత



జేసీబీతో అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు శనివారం కూల్చివేయించారు. మండలంలోని ఖాజీపల్లిలో గల 181 సర్వే నంబర్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలను ఆర్‌ఐ జయశంకర్ నారాయణ జేసీబీలతో కూల్చివేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠినచర్యలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బలగాల కవాతు



ఝరాసంగంలో కవాతు నిర్వహిస్తున్న బలగాలు

ఝరాసంగం/కోహీర్/న్యాల్‌కల్(జహీరాబాద్): ఎన్నికల నేపథ్యంలో పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. శనివారం రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఝరాసంగం, ఎల్గోయిలో ప్రధాన చౌరస్తాతో పాటుగ్రామ వీధులలో కవాతు నిర్వహించాయి. న్యాల్‌కల్‌లోనూ జహీరాబాద్ డీఎస్పీ రఘు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా కొనసాగిన ఈ కార్యక్రమంలో పోలీస్‌లు, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. కోహీర్‌లో.. డీఎస్పీ రఘు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల్లో మణిపూర్, చత్తీస్‌గఢ్‌కు చెందిన 99వ బెటాలియన్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కలిసి కవాతు నిర్వహించారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దాడే, ఎస్సై విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గంధం చెక్కలు స్వాధీనం



గంధం చెక్కలను.. నిందితుడిని చూపుతున్న టాస్క్‌ఫోర్స్ బృందం

రాయికోడ్(అందోల్): ఒక ఇంటిపై టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసి గంధపు చెక్కలను స్వాధీనం చేసుకుంది. మండలంలోని సింగితం గ్రామానికి చెందిన ఎండీ ఖుద్దూస్ నివాసంలో శనివారం టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించింది. ఇందులో నిందితుడి నుంచి 11 కిలోల గంధపు చెక్కలను స్వాధీనం చేసుకుంది. అడవీ శాఖ అధికారులు పట్టుబడిన గంధం చెక్కల విలువను అంచనా వేస్తారన్నారు.

ర్యాండమైజేషన్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అబ్జర్వర్ దీపక్, ఈఆర్వో వెంకటేశ్

నారాయణఖేడ్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఈవీఎం, వీవీ ప్యాట్‌లకు సంబంధించి రెండో రౌండ్ ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. నియోజకవర్గంలో 296 పోలింగ్ కేంద్రాలున్నాయి. అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్ల ర్యాండమైజేషన్‌ను ఈఆర్వో వెంకటేశ్ నిర్వహించి, అవగాహన కల్పించారు. జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు విజయ్‌కుమార్ వెలన్, అందోల్, ఖేడ్ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు దీపక్ పాల్గొన్నారు. అనంతరం వ్యయ పరిశీలకులు విజయ్‌కుమార్ వెలన్ అభ్యర్థుల ఖర్చు వివరాలపై అవగాహన కల్పించారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

- కాంగ్రెస్ కర్ణాటక మంత్రులు

జహీరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పూర్తి మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమని కర్ణాటక మంత్రులు ఈశ్వర్‌ఖండ్రే, రహీంఖాన్ అన్నారు. శనివారం పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ తరపున నిర్వహించిన సామాజిక వర్గాల ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడారు. కర్ణాటకలో ఎన్నికల ముందుకిచ్చిన ఐదు హామీలను అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణలో సైతం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు.

ధూంధాంగా ప్రజా ఆశీర్వాద సభ

• భారీగా తరలివచ్చిన జనం, పార్టీ శ్రేణులు • పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు

చేర్యాల(సిద్దిపేట)/సిద్దిపేట కమాన్: ఊరూవాడా కదిలింది. జై తెలంగాణ అంటూ గులాబీ జెండా పట్టుకుని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభకు హాజరయ్యారు. తరలి వచ్చిన జనంతో జనగామ 'గులాబీ' పార్టీలో మరింత నూతనోత్తేజం నిండింది. సాధారణ ఎన్నికల నేపథ్యంలో శనివారం చేర్యాల పట్టణ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వెనుక గ్రౌండ్‌లో జరిగిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రజలనుద్దేశించి మాట్లాడారు. సభలోకి ప్రజలను మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రత్యేక మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేసి లోనికి అనుమతించారు. సభ వద్దకు 4.19నిమిషాలకు ప్రత్యేక కాన్వాయ్‌లో చేరుకున్న సీఎం కేసీఆర్ ప్రజలకు అభివాదం చేశారు. మిట్టపల్లి సురేందర్, ఇతర కళాకారుల బృందం తెలంగాణ ధూంధాం పాటలతో సభికులను ఉత్తేజ పరిచారు. సీఎం కేసీఆర్ సభ వద్దకు చేరుకోగానే ప్రజలు పెద్ద ఎత్తున జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు నాగపురి రాజలింగం, బోడకుంటి వెంకటేశ్వర్లు, జనగామ జిల్లా పరిషత్ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు, మున్సిపల్ చైర్ పర్సన్లు పోకల జమున, అంకుగారి స్వరూపరాణి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్లు బాల్దె సిద్దిలింగం, సుంకరి మల్లేశంగౌడ్, ఎంపీపీలు ఉల్లంపల్లి కరుణాకర్, బద్దిపడిగ కృష్ణారెడ్డి, తలారి కీర్తన, జెడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అనంతుల మల్లేశం, గీస బిక్షపతి, మంద యాదగిరి, మేక సంతోష్, మున్సిపల్ కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్, యాట కనకవ్వ, జుబేదా, పచ్చిమడ్ల సతీష్, కో–ఆప్షన్ సభ్యుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, రైతు బంధు జిల్లా సభ్యుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, రైతు బంధు మండల కోఆర్డినేటర్ తాడెం రంజిత, నాయకులు జల్లి సిద్దయ్య, ముస్త్యాల బాల్‌నర్సయ్య, ఉల్లెంగుల పద్మ ఏకానందం, మేర్గు శ్రీనివాస్, గదరాజు చందు, కోతి విజయ్, జింకల పర్వతాలు, శివగారి అంజయ్య, తాటికొండ సదానందం, కోతి దాసు, శనిగరం లక్ష్మణ్, పచ్చిమడ్ల సాయికిరణ్, కొంగరి గిరిధర్,రావుల ఉమేష్, యాట బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

- సభా ప్రాంగణం చుట్టూ ఏర్పాటు చేసిన ప్రభుత్వం సంక్షేమ పథకాల కటౌట్లు ఆకర్షణగా నిలిచాయి.
- జనగామ–సిద్దిపేట ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు చేపట్టారు.
- సీఎం కేసీఆర్ రోడ్డు మార్గం గుండా రావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అడుగడుగునా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టారు.
- 4.19ని.లకు సీఎం కేసీఆర్ సభా స్థలికి చేరుకున్నారు.
- 4.34ని.లకు సీఎం కేసీఆర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు.
- 42 నిమిషాల పాటు కొనసాగిన సీఎం కేసీఆర్ ప్రసంగం 5.16నిమిషాలకు ముగిసింది.
- సభలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ద్వారా ప్రజలు సీఎం ప్రసంగాన్ని ఆసక్తిగా తిలకించారు.
- సీఎం కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో తనదైన శైలిలో విసిరిన చలోక్తులకు ప్రజలు కేరింతలు కొట్టారు.
- 5.20నిమిషాలకు సీఎం కేసీఆర్ ప్రత్యేక కాన్వాయ్‌లో రోడ్డు మార్గం గుండా తిరిగి వెళ్లారు.
- ప్రసంగం ముగిసిన తర్వాత సుమారు అరగంట పాటు బాణాసంచాలు పేల్చి గులాబీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు.


సభలో కార్యకర్తల కేరింతలు


అభివాదం చేస్తున్న కేసీఆర్, పల్లా


గులాబీ జెండాలతో సభకు విచిత్రంగా వచ్చిన మనోహర్


సీఎం కేసీఆర్‌కు బొట్టుపెడుతున్న మహిళా నాయకురాలు


సీఎం కేసీఆర్‌తో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి


కారు గుర్తు జ్ఞాపికను అందిస్తున్న నాయకులు


కళాకారుల ఆటాపాట

చట్టాలపై అవగాహన అవసరం

జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి కె.అనిత

నర్సాపూర్: గ్రామీణ ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత చెప్పారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. వాహనాలకు ఇన్స్యూరెన్స్, వాహనదారులకు లైసెన్సు లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన వ్యక్తుల కుటుంబాలకు బీమా అందక ఇబ్బందులకు గురవుతూ మండల లీగల్ సర్వీస్ కోర్టును ఆశ్రయిస్తున్నారని ఆమె విచారం వ్యక్తం చేశారు. కాగా 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ లైసెన్సు పొందాలని, వాహనాలకు తప్పక ఇన్స్యూరెన్స్ చేయించాలని ఆమె చెప్పారు. చట్టబద్ధంగా అనుమతులు లేకుండా రోడ్డుపై వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులైతే చట్టరీత్యా కఠినంగా శిక్షించబడతారని జడ్జి హెచ్చరించారు. కార్యక్రమం అనంతరం పలు కేసులను పరిష్కరించారు. న్యాయవాదులు ఆనంద్‌కుమార్, స్వరూపరాణి, రాజేంద్ర కృష్ణ, కోర్టు సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జూట్ బ్యాగులపై ఉచిత శిక్షణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో శాస్త్రిత్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జూట్ బ్యాగ్ పై ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ గడ్డం సుదర్శన్ తెలిపారు. శనివారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో నాలుగు వారాల పాటు శిక్షణ ఉంటుందన్నారు. డిసెంబర్ 4 నుంచి ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. జూట్ లంచ్ బ్యాగ్, జూట్ పర్స్, జూట్ ఫైల్స్, జూట్ ఫోల్డర్లు, జూట్ లగేజ్ బ్యాగ్, జూట్ ల్యాప్‌టాప్ బ్యాగ్‌ల తయారుపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం పూర్తయిన తర్వాత అభ్యర్థులకు సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. జూట్ వ్యాపారం ఎలా ప్రారంభించాలో, బ్యాంకు రుణం పొందడానికి రిజిస్ట్రేషన్, నమూనా ప్రాజెక్ట్ నివేదిక మార్గదర్శకం చేయబడుతుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం 8978649108 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గానుగపూర్‌కు ప్రత్యేక బస్సులు

సంగారెడ్డి టౌన్: కర్ణాటక రాష్ట్రంలోని ప్రముఖ దత్తాత్రేయ క్షేత్రమైన గానుగపూరుకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు సంగారెడ్డి డిపో ఉపేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న రాత్రి 9 గంటలకు సంగారెడ్డి న్యూ బస్టాప్ నుంచి బయలుదేరే బస్సు 27న ఉదయం 3 గంటలకు గంగాపూర్ చేరుతుందన్నారు. దర్శనం అనంతరం రాత్రికి సంగారెడ్డి చేరుకుంటుందని చెప్పారు. టూర్ ప్యాకేజీ కింద ఒక్కొక్కరికి రూ.800 చార్జి తీసుకుంటారని తెలిపారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి


అచ్చన్నపల్లిలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అందోల్ అభ్యర్థి క్రాంతికిరణ్

టేక్మాల్(మెదక్): కోట్లాది రూపాయల నిధులు విడుదల చేసి గ్రామాలను అభివృద్ధి చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని అందోల్ ఆ పార్టీ అభ్యర్థి క్రాంతికిరణ్ తెలిపారు. శనివారం మండలంలోని చంద్రుతండా, లక్ష్మణ్‌తండా, అచ్చన్నపల్లి, హసన్‌మహ్మద్‌పల్లి గ్రామాల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడోసారి కేసీఆర్ సీఎం అవ్వగానే అసైన్డ్ భూములను పట్టా భూములుగా మారుస్తామన్నారు. మూడు గంటల కరెంట్ ఇస్తామంటున్న కాంగ్రెస్ పార్టీని నమ్మొద్దన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయన్నారు. అచ్చన్నపల్లిలో యువకులతో కలిసి బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు వీరప్ప, జైపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ముఖ్తార్, రాజయ్య, యశ్వంత్‌రెడ్డి, చింత రవి, సిద్దయ్య, సలీమ్, భాస్కర్, సర్దార్, మణెయ్య, విక్రంగౌడ్, అశోక్, అవినాష్, శ్రీధర్‌రెడ్డి, బాల్‌రాజ్, సత్యాగౌడ్, సుధాకర్, మాణిక్యం ఉన్నారు.

మరోసారి ఆశీర్వదించండి..

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మేడికుందా గ్రామంలో శనివారం అందోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ భార్య పద్మ, స్థానిక మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. సీఎం కేసీఆర్ పథకాలను వివరిస్తూ తన భర్త క్రాంతికిరణ్‌ను మరోసారి గెలిపించాలని ఆమె ఇంటింటికీ తిరుగుతూ అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ పత్రి క్రిష్ణవేణి, పి.సురేఖ, వినోద్‌గౌడ్, ఇందిరాబాయి, నందిని, నవనీత, వీరారెడ్డి, శివాజీరావు, అప్పారావు పాల్గొన్నారు.

ముదిరాజ్‌బిడ్డలు బీఆర్‌ఎస్ వైపే..

జోగిపేట (అందోల్): అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్న బీఆర్‌ఎస్ సర్కార్ వైపే ముదిరాజ్‌లు ఉన్నారని, సీఎం కేసీఆర్ పాలనను మరోసారి కోరుకుంటున్నారని అందోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్ అన్నారు. జోగిపేటలో శనివారం ఓ ప్రయివేట్ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముదిరాజులంతా ఏకతాటిపైకి వచ్చి బీఆర్‌ఎస్ పార్టీకి పూర్తి మద్దతునివ్వాలని, అభివృద్ధిపై తప్పుడు ప్రచారం చేస్తున్న దామోదర రాజనరసింహకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రభుత్వ పథకాలన్నీ ఆగిపోయి ప్రజలంతా ఆగమైపోతారన్నారు. ముదిరాజ్‌ల ప్రధాన డిమాండ్ అయిన బీసీడీ నుంచి బీసీఏలో కలిపేందుకు కృషి చేస్తానన్నారు. రైతు బీమా తరహాలోనే రూ.5 లక్షల బీమాను కోటి కుటుంబాలకు ఇవ్వబోతున్నామని పేర్కొన్నారు. అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు ఇవ్వనున్నామని, ఆరోగ్యశ్రీ ద్వారా 15 లక్షల చికిత్సను ఉచితంగా అందించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫిషరీస్ సహకార చైర్మన్ పిట్టల రవీందర్, మఠం బిక్షపతి, శ్రీనివాస్, నారాయణ, మందుల వరలక్ష్మి, నాగేష్, జయపాల్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, శివ శేఖర్, శ్రీకాంత్, నాగభూషణ, వెంకటేశం, సునీల్, అశోక్, ఈశ్వర్ పాల్గొన్నారు.

విచిత్రంగా ప్రచారం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్, మేడిపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా శనివారం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ శర్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు కుల సంఘాలు బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆయన వెంట ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, వనిత, శ్రీనివాస్, గాజుల బాబు, సరిత, సదానందం గౌడ్, కనకరాజు ఉన్నారు.



సిద్దిపేటజోన్: పట్టణంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి హరీశ్‌రావు కు మద్దతుగా పార్టీ శ్రేణులు శనివారం ప్రచారం చేశారు. వ్యాపారులను, వివిధ కుల వృత్తుల వారిని కలిసి పనిలోపనిగా సాయం చేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. భరత్‌నగర్‌లో పానీపూరీ బండి వద్ద కట్లెట్ చేస్తూ పార్టీ కార్యకర్తలు ఓటు అభ్యర్థించారు.



సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

• ఇవే గెలుపునకు దోహదం
• బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే విజయానికి సోపానాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధికి మరో అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. శనివారం మండల కేంద్రమైన నిజాంపేట్‌లో మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నిజాంపేట్‌ను మండలకేంద్రంగా చేసుకొని ప్రజల చిరకాల కోరిక నెరవేర్చుకున్నామని గుర్తుచేశారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా ఉందన్నారు. ప్రజల అభ్యున్నతి కోసం అనేక పథకాలను సీఎం ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యకర్తలు ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. అంతకు ముందు స్కూల్ తండాలోనూ ప్రచారం నిర్వహించారు. గొసేబాగ్ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం తడ్కల్, కంగ్టి, పీర్ల తండాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆయన సక్షమంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, సర్పంచ్ జగన్‌చారి, ఉప సర్పంచ్ రాజీబాయి రాంచందర్ తదితరులున్నారు.


నిజాంపేట్‌లో భూపాల్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డికి గజమాలతో సత్కారం


కల్హేర్ ప్రచారంలో మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

మరోసారి బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టాలి

కల్హేర్ (నారాయణఖేడ్): ప్రభుత్వం హయాంలో దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాల అమలుతో అభివృద్ధిలో దూసుకు పోతున్నామని ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన కల్హేర్, మాసాన్‌పల్లి, బాచేపల్లి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరింత అభివృద్ధి కోసం మరోసారి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. తమతోనే సంక్షేమ, సుభిక్ష పాలన సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నర్సింహ్మారెడ్డి, ఎంపీపీ గుర్రపు సుశీల, ఆత్మ చైర్మన్ రాంసింగ్, మాజీ ఎంపీపీ పద్మ బాపురాజు, సర్పంచ్‌లు లచ్చవ్వ, కమలమ్మ, కిష్టారెడ్డి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా చేరికలు

కంగ్టి(నారాయణఖేడ్): తడ్కల్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శనివారం భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. తడ్కల్ గ్రామానికి చెందిన మామిడి పండరి, కోటగిరి పండరి, దత్తు, రమేశ్, సాయులు, హన్మండ్లు, సంతోశ్, మొగులయ్య, గోపాల్, తట్టి సంతోశ్, నగేశ్, లింగయ్య, ప్రకాశ్, తట్టి సాయిలు, ఉత్తెర్ల సాయిలు, విఠల్, కంగ్టి రాములు సహా 40 కుటుంబాలకు చెందిన వారు పార్టీలో చేరారు. భూపాల్‌రెడ్డి గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంగారాం, డీసీసీబీ డైరెక్టర్ గుండు వెంకట్రాములు, నాయకులు సత్యనారాయణ, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ సిటీగా తీర్చిదిద్దుతా


సంగారెడ్డిలో మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

సంగారెడ్డి: సంగారెడ్డిని మోడల్ సిటీగా మారుస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని వివిధ వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు మంగళ హారతులు, పూల వర్షం, డప్పు చప్పుళ్లతో ఘనస్వాగతం పలికారు. ర్యాలీలో పెద్ద ఎత్తున మహిళలు, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ అందుబాటులో ఉండే నాయకుడికే ఓటు వేయాలని ప్రజలను కోరారు. తన ప్రాణం ఉన్నంత వరకు తమ మధ్య ఉంటానని చెప్పారు. ఓటు వేసే విషయమై ప్రజలు ఆలోచించాలని పిలుపునిచ్చారు. మంచి చేసే నేతకే అమూల్యమైన ఓటు వేయాలని సూచించారు. భారీ మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి రవి, ముఖీం, పట్నం మాణిక్యం, రాజేందర్, నరహరిరెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు హకీమ్, పట్టణ ప్రెసిడెంట్ ఆర్.వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అంజాద్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, పెద్దఎత్తున బీఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న చింతా సతీమణి అరుణ

గెలిపిస్తే అభివృద్ధిపై 'చింత' ఉండదు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ గెలుపు కోసం ఆయన సతీమణి చింతా అరుణ, కూతురు స్రవంతి పార్టీ శ్రేణులతో కలిసి శనివారం మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని చెప్పారు. తమ అమూల్యమైన ఓటు చింతా ప్రభాకర్ కు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామాల అభివృద్ధి కేవలం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని, అదే లక్ష్యంతో పనిచేస్తున్న ఆయనకు మద్దతు ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యాదమ్మ, మాజీ ఎంపీపీ మల్లమ్మ, సర్పంచ్ శ్రీహరి, ఎంపీటీసీ లలిత నాయకులు రాములు, జానీ మియా, సుభాశ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.